

# యజ్ఞం

## – శేషచంద్ర

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో సాధారణ బహుమతి పొందిన నవల

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది.** ఎన్నికల కోలాహలం మొదలైంది..ఆశావాహులు టిక్కెట్లుకోసం రాజధాని బాట పట్టారు. అబ్బిరెడ్డి మీద ఎన్నో ఆరోపణలున్నాయని , కోర్టులో కేసులు పెడింగ్ ఉన్నాయని ఎంకట్రెడ్డి తన వర్గంతో అధిష్టానానికి చెప్పినా, వాళ్ల మాటలు పక్కన పెట్టి పిసిసి అధ్యక్షుడు అబ్బిరెడ్డి డబ్బులుకు ఆశపడి అబ్బిరెడ్డికే టికెట్టు ఇచ్చాడు. అబ్బిరెడ్డి మండలంవారిగా గ్రామాల్లోని నాయకుల్ను పిలిపించుకొన్నాడు. తనను ఏలాగైనా గెలిపించాలని నాయకుడికి ఒక్కొక్కడికి ఓటర్లను బట్టి ఇన్ని లక్షలు ఇస్తానని చెప్పాడు. అది కేవలం వాళ్ల స్వంతానికే నని ఓటర్లకు పంచేందుకు వేరే మొత్తముంటుందని ఓటర్లను బ్రతిమాలో భయపెట్టో ఆశపెట్టో.తనకు ఓట్లు పడేలా చూడాలని చెప్పాడు. గ్రామంలోని చోటా నాయకులకు తమ పంట పండినట్లైంది. గ్రామాల్లో అబ్బిరెడ్డి తిరగకపోయినా వాళ్లే తిరిగి ప్రతి ఒక్కర్ని తమవైపే తిప్పుకొనే ప్రయత్నం చేయసాగారు.. గ్రామాల్లో ప్రతి ఇంటి ముందు జెండాలు రెప రెప లాడసాగాయి. ఇలా ఉండగా ప్రతి పక్ష పార్టీకి రెండు మార్లు గెలిచిన నేత కొడుకు సమర్ధుడు కాదని వార్త చక్కర్లు కొట్టడంతో అతనికి టిక్కెట్టు ఇచ్చేందుకు వెనకా ముందు ఆలోచించసాగింది ప్రతిపక్షం. అబ్బిరెడ్డికి, ఎంకట్రెడ్డికి మధ్య పొసగక పోవడంతో ఇప్పుడిప్పుడే పుంజుకొంటున్న రుద్రకు లేదా ఎంకట్రెడ్డికి టిక్కెట్టు ఇచ్చేందుకు సముఖంగా ఉన్నట్లు ప్రతి పక్ష పార్టీ నాయకులు ఎంకట్రెడ్డిని సంప్రదించారు.ఎన్నికల్లో ఖర్చయ్యే ప్రతి పైసా తామే ఇస్తామని చెప్పారు. కాని ఇన్ని సంవత్సరాలుగా ఉన్న పార్టికి ద్రోహం చేసేదిలేదని దాన్ని ఎంకట్రెడ్డి తిరస్కరించాడు. స్వతంత్ర అభ్యర్థిగా నిలబడాలని నిశ్చయించుకొన్నారు. ప్రతి పక్ష పార్టీ మరోలా పావులు కదిపింది. అబ్బిరెడ్డికే గాలెం వేసింది. విషయం తెలుసుకొన్న పాలక పార్టీ కూడా అబ్బిరెడ్డి జారిపోతాడేమో నని ముందుగానే భారీగానే డబ్బులు ముట్ట చెప్పింది. డబ్బులకైనా పార్టి మారకుండా ఉంటాడని. కాని ఈసారి ప్రతి పక్షపార్టీ గాలి తోలుతుందని పాలకపార్టీ మళ్లీ అధికారంలో రావడం కష్టమని అందరు అనుకోవడంతోను దానికనుగుణంగా వార్తలు ఎక్కువగా వస్తుండటంతో మళ్లీ ఆలోచనల్లో పడ్డాడు అబ్బిరెడ్డి. తను ఏ పార్టిలో ఉన్నా తనకు నియోజక వర్గంలో పోటిలేదని తను గెలుస్తానని నమ్మకం ఎక్కువకావడంతో ఇక నామినేషన్

చివరి రోజనగా ప్రతిపక్ష పార్టీతో చేతులు కలిపాడు అబ్బిరెడ్డి. అక్కడా కోట్లు దండుకొన్నాడు. రాత్రికే రాత్రే ఇంటి పైన పాలకపార్టీ జెండాల స్థానంలో ప్రతిపక్ష పార్టీ జెండాలు రెప రెప లాడాయి. నివ్వెరపోయింది పాలక పార్టీ. అబ్బిరెడ్డిని నమ్మి కోట్లు ఇచ్చింది. పార్టీ క్యాండిడేట్ పోవడమే కాకుండా కోట్లుకూడ నష్టపోయినా చేసేది ఏమి లేక ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో కక్ష సాధింపు చర్యలు చేసేందుకు కూడా వీలులేకపోయింది. తమ పార్టీ అధికారంలోకి వస్తే అబ్బిరెడ్డి అంతు చూడాలనుకొంది. పాలక పార్టీ అధిష్టానం ఎంకట్రెడ్డిని బుజ్జగించడం మొదలు పెట్టింది. స్వతంత్ర అభ్యర్థి కన్నా అదే మంచిదన్న అభిప్రాయతో రుద్ర అతని స్నేహితులు బలవంతం చేయడంతో పాటు నియోజక వర్గంలో చాలా మంది మంచిని కోరుకొనే వాళ్లు ఎంకట్రెడ్డిని బలవంతం చేసినా ఒప్పుకోలేదు ఎంకట్రెడ్డి. చివరికి మునిశేఖరు అందుకు సిద్ధపడటంతో పాలకపార్టి తరుపున అతనికి టికెట్టు వచ్చి అబ్బిరెడ్డికి పోటిగా నిలబడ్డాడు.

ఎంకట్రెడ్డితో పాటు రుద్ర బృందం శేఖరం ప్రచారానికి రంగలోకి దిగింది. ఇక అబ్బిరెడ్డి తను ఈ సారి గెలవకపోతే తనకు భవిష్యత్తు అనేది ఉండదని, పాలక పార్టి కూడ తనను అంతగా సుళువుగా వదలదని తను కటకటాల పాలు కాక తప్పదనుకొని పాలక పార్టీ, ప్రతి పక్షపార్టీలు ఇచ్చిన కోట్ల డబ్బుతో పాటు తన స్వంత డబ్బుకూడా జతచేసి డబ్బును వరదలా పారించసాగాడు.ఎప్పడు లేనంతంగా నియోజక వర్గం అందరి దృష్టిలో పడింది. ముని శేఖరం, ఎంకట్రెడ్డిలు ఒక పక్క తిరుగుతుంటే రుద్ర బృందం తిరగడమే కాకుండా, వాట్సప్, ట్విట్టర్లతో ఇన్స్టాగ్రామలు వేదిక చేసుకొని అబ్బిరెడ్డి దురాగతాలను బట్టబయలు చేయడమే కాకుండా తాము. డబ్బులు మందు పంచమని. తమను గెలిపించినా గెలిపించక పోయిన చెప్పిన వాగ్దానాల ప్రకారం ప్రతి గ్రామంలో మంచి నీరు, విద్యుత్తు, రోడ్లు అభివృద్ధి చేస్తామని చెప్తూ ప్రచారం ఉదృతంచేసారు. మండలాల్లో డబ్బులు పంచకపోయినా రుద్ర చేసిన పనులు మీద నమ్మకంతో, అబ్బిరెడ్డి మీద ద్వేషంతో ప్రతి గ్రామంలో యువకులు గ్రూపులుగా ఏర్పడి స్వంత ఖర్చుపెట్టుకొని ప్రచారం చేయసాగారు. అతి తక్కువ సమయంలోనే రుద్ర వల్ల మునిశేఖరం అంత గట్టి పోటీ ఇస్తాడని అబ్బిరెడ్డి ఊహించలేదు.

అబ్బిరెడ్డి బొటబొటా మెజారిటితో గెలుపొందడం ఒక అదృష్టమైతే,అన్యూహంగా పాలకపార్టీ అంచనాలు తలక్రిందులుచేస్తూ ప్రతి పక్ష పార్టీ పూర్తి స్థాయి మెజార్టితో సీట్లు గెలుచుకోవడం నక్కతోకను తొక్కినట్లైంది అబ్బిరెడ్డికి. ఆఖరి క్షణాల్లో తను పార్టి మారడం వల్ల ప్రస్తుత పాలక పార్టీ నే మళ్లీ అధికారంలోకి వస్తే ఏలాంటి పరిస్థితి ఎదురుకోవల్సివస్తుందో అనుకొన్న అబ్బిరెడ్డి ఆనందానికి అంతులేకుండాపోయింది.

ముని శేఖరం ఓడిపోయినా అతి తక్కువ సమయంలో తాము గట్టి పోటి ఇచ్చినందుకు రుద్ర బృందం సంతోషపడింది. నియోజక వర్గం మొత్తం మళ్లీ మునిశేఖరం, ఎంకట్రెడ్డిలు,రుద్ర బృందం తిరుగుతూ గ్రామం తిరుగుతూ తమకు ఓటు వేసినందుకు కృతజ్ఞతలు చెప్పడమే కాకుండా తాము చెప్పిన వాగ్దానాలు నెరవేర్చేందుకు ఎన్నికల్లో ఖర్చులకోసం ఇచ్చిన పార్టీ ఫండ్తో పాటు తమ స్వంత డబ్బును కూడా వినియోగించుందుకు సిద్ధమయ్యారు. రుద్ర,

ఎంకట్రెడ్డి, మునిశేఖరలకు మంచి పేరు రావడంతో పాటు ప్రతి గ్రామంలోని యువకులకు రుద్రతో చేతులు కలపడానికి సిద్ధమయ్యారు.

ఇక అబ్బిరెడ్డి ప్రమాణ స్వీకారానికి చేయగానే అరాచకాల మొదలయ్యాయి. మొట్టమొదటగా రేషన్ షాపు డీలర్ల మీద పడింది అతని దృష్టి. పాలకపార్టికి సపోర్టు చేసిన ఏ డీలరుకూడా ఉండకూడదని వాళ్లచేత బలవంతంగారాజీనామాలను ఇప్పించే ప్రయత్నంచేసాడు. ఇవ్వక పోతే విజిలెన్స్, డిఎస్ఓ సిబ్బందిని పంపి వాళ్ల షాపులను ఏదో ఒక నెపం చూపించి సస్పెండు అయ్యేలా చూసాడు. తనకు అనుకూలమైన అధికారులను తమ కులపు వాళ్లను మైదుకూరుకు వేయించుకొన్నాడు..

పరమేశాన్ని బదిలీ చేయించాలని అనుకోలేదు. ఎందుకంటే పరమేశాన్ని ముప్పుతిప్పలు పెట్టాలని లేదా వీలు దొరికితే మళ్లా సస్పెండుచేయించాలని. అదే విధంగా తనకు ఎదురు తిరిగిన సిఐ అరవిందు పైకూడా ప్రతీకారం తీర్చుకొనేందుకు ఉద్దేశ్య పూర్వకంగా అతన్ని మళ్లీ మైదుకూరుకు బదిలీ చేయించుకొన్నాడు. తన కులపు వాడు తను చెప్పినట్లు వింటాడని నీలకంఠారెడ్డిని తహశిల్దారుగా వేయించుకొన్నాడు.

తనపై హత్యా ప్రయత్నం చేసినదాంట్లో రుద్ర అతని స్నేహితుల హస్తముందని దొంగ సాక్ష్యాలను సృష్టించి నానా బెయిల్ బుల్ వారెంటు జారీ అయ్యేలా చేసి అరెస్టు చేయించాడు. నియోజక వర్గంలో గ్రామగ్రామలోని యువకులు ఆందోళన చేయడంతో వాళ్లను కంట్రోల్ చేసేందుకు బైటనుండి ఫోర్స్ తెప్పించాల్సి వచ్చింది. ఆసమయంలో స్పందించిన నక్సలైట్లు అబ్బిరెడ్డి పై దాడికి తామే కారణమని అతని అరాచకాల వల్లే అతన్ని తుదముట్టాంచాలనుకొన్నామని అతను ఇంకా అరాచకాలు చేస్తూ అమాయకుల్ను ఇబ్బంది పెడుతున్నాడని అతనికి చావు మా చేతిల్లోనే ఉందని పేపరు ప్రకటన ఇచ్చారు. దాంతో రుద్ర అతని మిత్రుల మీద కేసు వీగి పోయింది.. నక్సలైట్ల వల్ల తనకు ముప్పు ఉంటుందేమోనని భయమేసినా అబ్బిరెడ్డి తన పనులుకు విరామం ఇవ్వలేదు కాని తన అనుచరుల్ను పెంచుకొన్నాడు.

ఎన్నికల్లో భాగంగా ఎన్నికల సమయంలో నిర్మలను కర్నూలు జిల్లాకు బదిలీ చేసారు. ఎన్నికలు అయిపోగానే చాలా మటుకు అందర్ని పూర్వపు స్టేషన్లోనే వేయడంతో ఆమెను తిరిగి చిత్తూరుకే ఆర్డివోగా వేసారు. దాంతో నిర్మల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారింది. ఎన్నికలముందు తనను రెకమెండేషన్ ద్వారా చిత్తూరు ఆర్డోవోగా వేయించిన ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడిపోయాడు. ప్రస్తుత ఎమ్మెల్యే అప్పుడు ప్రతి పక్ష పార్టీలో ఉండటంతో ఆమె అతన్ని కేర్ చేయలేదు. ఇప్పుడు అతనికే నమస్కారం చేయాల్సిన పరిస్థితి వచ్చింది. నిర్మల ఆఫీసులో జాయిన్ కాగానే ఆ ఎమ్మెల్యే వచ్చి వాడి బాషలో " ఆడు ఆర్డివోగా ఏయించాడని, అధికారంలో ఉండాడని వోడు చెప్పందల్లా సేసినవు. ఇప్పుడు నేను సెప్పినట్లు సేయలా. వాడికి ఎట్టా అడదిడ్డంగా సేసినవో మాకాడ అన్ని ఉండాయి. ఇంగ మీద వోడికి గాని వోడికి సంబంధించినోడికి ఏపని సేసినా ఊరుకుండేదిలే నువు సేసినేటివన్నీ బైట పెట్టి నిన్ను ఇంటికి పంపడం ఖాయం "అంటూ బెదిరించాడు.

“మా ప్రభుత్వముంది ఏమీ కాదు “ అని అడ్డమైన పనులు చేయించుకొన్న ఎమ్మెల్యేకూడ ఆమెను బ్లాక్ మెయిల్ చేసి బెదిరించాడు. తన మాటలు వినకుండా అధికార పార్టికి పనులు చేస్తే గతంలో రూల్స్ కు విరుద్ధంగా చేసిన పనులను బైట పెడ్తానన్నాడు. అతని మాటలు నమ్మి తన క్రింది స్థాయి అధికారుల సంతకాలు లేకుండా వాళ్లను సంప్రదించకుండా అడ్డగోలుగా సంతకాల పెట్టేసింది. వాటి వల్ల లబ్ది పొందింది కోట్లు సంపాదించుకొన్నది అతను అతని వర్గీయులే . అంతో ఇంతో బిక్షగత్తెకేసినట్లు వేసారు ఆరోజు. దానికోసం కక్కూర్తి పడింది. దానికే ఆ రోజు తన తండ్రి ఇరవై సంవత్సారాలుగా సంపాదించలేని డబ్బును కొద్దినెలల్లోనే సంపాదిస్తానని చాలెంజి చేసింది పరమేశంతో. రాజకీయనాయకులు అంతా తన చేతిక్రిందే ఉన్నారని ఏ పనైనా సులభంగా చేసుకపోవచ్చని విర్రవీగింది. కొద్ది పాటి అధికారం చేతిలోకి రాగానే పిల్లప్పటినుండి తను నేర్చుకొన్న సంస్కారం నీతి నిజాయితీని తాకట్టు పెట్టి ఊబిలో దిగబడిపోయింది. ఇప్పుడు ఇబ్బందుల్లో పడగానే తన తండ్రి గుర్తుకొచ్చాడు.తండ్రితో తను వాదించింది గుర్తుకొచ్చింది.

“తప్పు చేసాను నాన్న మీ వద్ద డబ్బు లేక పోతే ఏం నీతి నిజాయితి గా నిలిచారు. ఎవరైనా తప్పు చేయమని బెదిరించినా చేసే వారు కాదు. బెదిరేవారు కాదు. విధిలేని పరిస్థితిలో తప్పు చేయాల్సి వస్తే సెలవులో వెళ్లే వారు. తప్పు చేసానన్న భయం మీకు ఇన్నేళ్ల సర్వీసులో లేదు. నేను నీలాగే ఉండి ఉంటే ఈరోజు ఒనమాలు కూడా రాని వాడి చేత అన్ని మాటలు పడాల్సిన మాటలు పడే అవసరముండేది కాదు అగౌరవ పడాల్సిన అవసరం కాని భయపడాల్సిన అవసరం ఉండేదికాదు. ఇప్పుడు నాకు ఆ ఆ అవకాశంలేదు. తను అక్కడ్నుంచి సెలవులో వెళ్లిపోవాలననుకొంటున్నా చేసిన తప్పులు ఎక్కడ బైటపెట్టారో నన్న భయం నన్ను వెంటాడుతుంది. “అనుకొంటూ బాధ పడసాగింది నిర్మల.

నిర్మలకు మరో ఎదురు దెబ్బ తగిలింది. ప్రతి నియోజక వర్గంలో అసైన్మెంటు కమిటి పెట్టి భూమిలేని పేదలకు భూ పంపకం నెల రోజుల వ్యవధిలో చేయవల్సిందిగా ఆదేశాలిచ్చింది ప్రభుత్వం. పాలక పార్టి ఎమ్మెల్యే వత్తిడితో విధిలేని పరిస్థితిలో స్థానిక ఎమ్మేల్యే బినామిలకు అతని అనుయాయులకు క్రింది స్ధాయి అధికారుల సిపార్సులను బేఖాతరు చేస్తూ ఏకంగా మూడు వందల ఎకరాలకు పట్టాలు ఇచ్చేసింది. ప్రతిపక్షాలు దాన్ని ఫోకస్ పెద్దగా ఫోకస్ చేసాయి.. అంతటితో వదలని కొంత మంది దాంతోపాటు ఆమె గతంలో అడ్డదిడ్డంగా చేసిన పనులన్నింటి సాక్ష్యాదారాలను చూపిస్తూ ప్రజాప్రయోజన వాజ్యం క్రింద ఆమె మీద హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసారు. ఆమె చేత తప్పు చేయించిన పాలక పార్టి ఎమ్మెల్యే తనకేమి తెలియదన్నట్లు తప్పు ఆమె మీద వేసి తప్పుకొన్నాడు. దాంతో ఆమె జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. పరమేశం మరింత కృంగిపోయాడు. నిజాయితీగా పనిచేసిన తనూ అవినీతిని మూటకట్టుకొని జైలుకెళ్లాడు. దానికి భయపడి రాజకీయనాయకుడికి అండకాచిన తన కూతురు కటకటాల పాలు కావల్సివచ్చింది. అడకత్తెర్లో నలిగిపోతున్న అధికారులకు రక్షణ ఎక్కడ ? తోలుబొమ్మలాటలో బొమ్మలా ఆడుతూ ఉండాల్సిందేనా ?

అదే సమయంలో మైదుకూరు మండలంలో కూడా భూపంపిణీ కోసం తహశిల్దారు నీలకఠం ను, ఆర్ఐ పరమేశాన్ని పిలిపించి రెండు వారాల తర్వాత అసైన్ కమిటీకి మీటింగుకు పెట్టేందుకు ఆర్డివోతో మాట్లాడానని ఓ మూడు వందల పేర్ల లిస్టు ఇస్తూ వాటికి పట్టాలు తయారు చేసి మీటింగ్లో పెట్టేలా చేయమని ఆదేశించాడు ఎమ్మెల్యే అబ్బిరెడ్డి..

పరమేశం, లిస్టు తీసుకొని గ్రామల్లో సర్వేయర్తో పాట విచారించంగా అవన్ని బొగస్ అని తేలాయి. అ పేరు గల వాళ్లు నియోజక వర్గ పరిధిలో లేరు. ఉన్న కొంత మంది అంతా భూస్వాములే. నిజానికి భూమిలేని రైతులు పేర్లు ఏమి లేవు. ఇలాంటి కుంభకోణం అబ్బిరెడ్డి ఏదో ఒకటి చేస్తాడని ఊహిస్తునే ఉన్నాడు తహశిల్దారు నీలకఠం రెడ్డి. అతను కట్టె విరక్కుండా పాము చావకుండా నడుచుకొనే రకం. అబ్బిరెడ్డి కి వ్యతిరేఖంగా నడుచుకోవడం వల్ల ప్రయోజనం లేదని పైనుండి వత్తిడి తెచ్చి తన పని నెరవేర్చుకొంటాడని ఏదైనా జరిగితే తనతో సహా విఆర్వో వరకు అందరు ఉద్యోగాలు పోతాయని పరమేశంతో పాటు సర్వేయరుతోను సమాలోచన చేసాడు. అబ్బిరెడ్డి భూ కుంభకోణం జరిగి తాము ఇరుక్కోకుండా తప్పించుకోవాలంటే ఒకటే మార్గం కనపడింది. రుద్రతోను సిఐ అరవింద్ తోను మాట్లాడి సహాయం కోరాడు. ఎందుకైనా మంచిదని ఆర్డోవో కు విషయం తెల్పాడు తహశిల్దారు. అందులో తన పాత్ర లేకపోవడంతోను అనవసరంగా అబ్బిరెడ్డివల్ల కేసుల్లో నిర్మలలాగా ఇరుకోవడం కన్నా అబ్బిరెడ్డి చీవాట్లు పెట్టినా ఇదే మంచిదనిపించి తహశిల్దారు చెప్పినట్లు చేసేందుకు సిద్ధపడ్డాడు ఆర్డివో.

అసైన్ మెంట్ కమిటిలో ఎమ్మెల్యేచేర్మన్, వైస్ చేర్మన్ ఆర్డివో,తహశిల్దారు ఇంకా మిగతా పార్టీ వాళ్లు సభ్యులుగా ఉంటారు. వాళ్ల ఆమోదంతో ప్రభుత్వభూమిని వ్యవసాయం చేసుకొనేందుకు భూమిని పేదలకు డికెటి పట్టాల రూపంలో హక్కుగా ఇస్తారు.

ఆరోజు ఉదయం 11.00 గంటలకు అసైన్ కమిటి మీటింగ్ తహశిల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న మీటింగ్ హాల్లో ఏర్పాటు చేయబడింది. పైకి గంభీరంగా ఉన్నా ఏం జరగబోతుందో ఏలాంటి సమస్యను ఎదుర్కోవలసి వస్తుందోనని ఆర్ఐ,తహశిల్దారుతో పాటు ఆర్డివో కూడా లోలోపల ఆందోళన పడసాగారు. 11.30గంటలకు గుంపును వెంటేసుకొని ఆర్భాటంగా వచ్చాడు అబ్బిరెడ్డి. తన సిబ్బంది తో వచ్చిన సిఐ అరవిందును చూసి అతను చేసిన సెల్యూట్ను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా మీటింగ్ హాల్లోకి నడిచాడు. రుద్ర అతని మిత్రులు రాలేదు కాని అతని తరుపున గ్రామాల్లోని చాల మంది యువకులు కూడా వచ్చారు. ఏదైనా జరిగితే ఎదుర్కోనేందుకు సిద్దపడతూ.

స్టేజిమీదికి రాగానే ఆర్డివో తహశిల్దార్లను“ అన్నీ రెడి చేసారా?“ అని అడిగాడు. తహశిల్దారు తలూపడంతో తన పేరన వందల ఎకరాలు హస్తగతమైపోతుందనుకొంటూ, అసైన్ మెంట్ కమీటీ మీటింగ్ అజెండాలో సంతకం పెట్టబోయి పేర్లను చూసి అందులో చివరకంటూ చూసినా తను ఇచ్చిన పేర్లు లేకపోవడంతో ఒక్కసారిగా ఆవేశం వచ్చేసింది అబ్బిరెడ్డికి. కల్లుతాగిన కోతిలా మారిపోయాడు. చేతిలో ఉన్న అసైన్ మెంటు కమిటి పుస్తకంలో పేపర్లుచింపుతూ అర్డివో

ముఖాన విసిరి కొట్టాడు.సిద్దంగా ఉన్న మీడియా వీడియో తీయబోతుండగా అబ్బిరెడ్డి అనుచరుల వాళ్ల కెమరాలు లాక్కొన్నారు. ఇక అక్కడ జరిగేదానికి సాక్ష్యం లేదని అబ్బి రెడ్డి రెచ్చిపోయాడు. ఆర్డివో వైపు అసహ్యంగా చీదరించుకొంటూ,

"నేను చెప్పిన పేర్లు ఒక్కటి లేదు. నువ్వు సూసినావా లేదా లిస్టును. " అన్నాడు

ఆర్డివో సమాధానం చెప్పలేక తలదించుకొన్నాడు.

"ఆడంగి ముఖ మేసుకోని ఎందుకీడ కూకోడం. వోళ్లేం సేసినారో సూసేదిలా. నేను సూసుకొవాల్నా లేక పోతే నిశాని నాకొడుక్కు ఏ తెలుస్తాదిలే గుడ్డిగా మా మాదిరిగా సంతకాలు సేసేస్తాడనుకొంటుండావా" అంటూ అవమాన కరంగా అబ్బిరెడ్డి మాట్లాడుతన్నా దించిన తల పైకెత్త లేదు ఆర్డివో.

అబ్బిరెడ్డి కోపం నీలకఠం మీదికి, ఆ పైన పరమేశం మీదికి పోయింది.వాళ్లద్దరే ఈ పని చేసిఉంటారని.

"ఏయ్ తాసిల్దారు, నీకేం చెప్పినా నేను సెప్పినేది సేయకుండా ఆ ఆరైగాడు సెప్పినట్టు సేస్తావా ఎమనుకొంటాడారు నన్ను సేతగాని ఎదవ అనుకొంటుండార్రా. రేయ్ ఆరై మర్యాదగా నేను సెప్పిన పేర్లు ఇప్పుడే ఈడ్నే రాసేసి తయారు సేయి " అన్నాడు ఆర్డరేస్తూ.

"మీరు ఇచ్చిన పేర్లన్ని అనర్హులివి. తెలిసి నేనా పని చేయను. " అన్నాడు పరమేశం తొణక్కుండా. అబ్బిరెడ్డి కళ్లలో రక్తం చిమ్ముతుండగా,

"సేయాలా సేసి తీరాలా ఏమనుకొంటాడువురా నీ ఇష్టమెచ్చినట్టు సేస్తుంటే సూసేదానికాఉండేది మేముండేది. మర్యాదగా చెప్పినట్టు సేసేయ్ " అన్నాడు కూర్చిల్లోంచి లేచి ఊగిపోతూ.

"అలాంటప్పుడు మీరే రాసుకొని మీరే సంతకం పెట్టుకొండి " అన్నాడు పరమేశం.

ఏమాత్రం భయం లేకుండా తనముందు పరమేశం అలా దిక్కరించి మాట్లాడే సరికి ఆవేశంతో బుసలు కొట్టాడు. దెబ్బమీద పడిన పిచ్చికుక్కలా రెచ్చిపోతూ,

"నా కొడకా ఎమనుకొంటుండావురా ఎదురుతిరిగి మాట్లాడుతుండావ్ అర్డివో తహశిల్దారట్టోళ్లు గమ్మనుంటే ఆరై నాకొడుకువి నీ కంతా పొగరా "

ఇన్ని సంవత్సరాలుగా కోపాన్ని కంట్రోలు చేసుకొంటు వస్తున్న పరమేశం ఆరోజు కోపాన్ని నిగ్రహించుకోలేక పోయాడు. ఆవేశం తన్నుకొస్తుంటే " నీ ఇష్టమెచ్చినట్లు మాట్లాడుతున్నావ్ ప్రతిసారి కొడకా కొడకా అంటున్నావా నేనేమన్నా వరదయ్యననుకొన్నావురా కొడకా నీ వేమంటే అది పడేదానికి. "అన్నాడు

అబ్బిరెడ్డితో సహా అంతా విస్తు పోయారు. పరమేశం అలా అంటాడని ఊహించలేదు అబ్బిరెడ్డి. అతని అనుచరులు అబ్బరెడ్డి ముఖం వైపు చూడసాగారు. అతనిచ్చే ఆదేశాలకోసం. తేరుకొన్న అబ్బిరెడ్డి కోపం అవధులు దాటింది.కూర్చున్న కుర్చిల్లోంచి లేచి " నా కొడకా నన్నే తిడ్తావురా. యాడ్నించో వచ్చిన నాకొడకువి. ఉండూర్లోని ఎందర్నో లేపేసినా

నువోలెక్కేందిరా " అని పక్కనున్న కుర్చీని ఎత్తి పరమేశం మీద వేసాడు. పరమేశం పక్కకు తప్పుకోవడంతో అది పక్కనున్న ఓ విలేఖరి మీద పడింది. అదే సమయంలో పరమేశం మీద దాడి జరగకుండా చూసేందుకు కొంత మంది యువకులు ముందుకు వస్తుండటంతో అబ్బిరెడ్డి అనుచరులు వాళ్లను అడ్డుకొన్నారు. కుర్చీ దెబ్బ తప్పించుకోవడంతో అబ్బిరెడ్డి స్టేజ్ మీద అడ్డంగా ఉన్న తహశిల్దారు ను ఆర్డివోను కుర్చిల్లోంచి తోసి పడేస్తూ పరమేశం మీదికి దూకి పిడిగుద్దులు గుద్దసాగాడు.లోపల జరుగుతున్న విషయం తెలుసుకొని అరవింద్ క్షణాల్లో తన బలగంతో లోపలికి వచ్చి దొరికినవాన్ని దొరికినట్లు అబ్బిరెడ్డి అనుచరుల్ను చావబాదసాగాడు. అబ్బిరెడ్డి అనుచరులు పోలీసుల్ను కూడా లెక్క చేయకుండా వాళ్ల మీద తిరగబడటంతో . బైటికి వెళ్లకపోతే కాల్చి పారేస్తానని హెచ్చరిస్తూ రివాల్వర్ను గాల్లోకి కాల్చాడు అరవింద్. అప్పటికి వాళ్లు లెక్కచేయకపోవడంతో ఒకరిద్దిరికి కాల్లో బులెట్టు దిగబడేటట్టు కాల్చాడు. వాళ్లు అరుస్తూ క్రింద పడటంతోను, అరవిందుక్కు అనుకూలమైన మరో ఇద్దరు పోలీసులు తుపాకులు తమపైకి ఎక్కు పెట్టడంతో భయపడ్డ అబ్బిరెడ్డి అనుచరులు బైటికి పరుగులు తీసారు. పరమేశంను కొడుతున్న అబ్బరెడ్డిని అరవింద్ బలవంతంగా పట్టుకొని బైటికి తీసుకొచ్చాడు. బైటికి వచ్చిన తర్వాత కూడా ఇంకా రెచ్చిపోయి అబ్బిరెడ్డి అరవింద్ మీద తిరగబడి కొట్టేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఎవరు వీడియో తీయడం లేదని గమనించిన అరవింద్ కసి దీరా అబ్బిరెడ్డిని లాఠీ తో కొట్టుకొంటూ తన్ను కొంటూ పక్కరూంలోకి తీసుకపోయి వాకిలేసాడు.

పరమేశంలకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఆర్డివో, కలెక్టరుకు జరుగుతున్న విషయాన్ని తెలియచేసాడు

***(ముగింపు వచ్చే నెలలో)***

COMMENTS